క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు మొక్కుగా చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

3,787 మందికి వైద్య పరీక్షలు

ఉయ్యాలవాడ : మండలంలో అక్టోబర్ 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 3,787 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని అల్లూరు, బోడెమ్మనూరు, ఇంజేడు, సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, హరివరం, కొండుపల్లె, తుడుమలదిన్నె గ్రామ సచివాలయాల పరిధిలోని ఇంటింటా సర్వే చేసి ఆరోగ్య సిబ్బంది, గ్రామ వలంటీర్లు 4,556 కుటుంబాలకు కూపన్లు అందజేశారన్నారు. వైద్య శిబిరాల్లో వైద్యాధికారులు గైనిక్ 131 మందికి, పీడియాట్రిక్ 310, ఎన్‌సీడీ ఓపీ 1,591, కంటి వెలుగు 818 మందికి, ఆరోగ్య శ్రీ రెఫర్ 70, ఈసీజీ 262, రక్త పరీక్షలు 1,235 మందికి, సీటీ స్కాన్ రెఫర్ 13, బీపీ షుగర్ పరీక్షలు 1,505 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. నంద్యాల, కర్నూలు, ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు 83 మందిని మెరుగైన వైద్య సేవల కోసం రెఫర్ చేయడం జరిగిందని ఎంపీడీఓ స్పష్టం చేశారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కింద వున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

నేడు పెద్ద చర్చిలో శోధనపై సెమినార్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని హోలీ క్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1 (పెద్దచర్చి)లో యువతీ యువకులకు శోధనపై సోమవారం సెమినార్ నిర్వహిస్తున్నట్లు పాస్టరేట్-1 డీనరీ చైర్మన్ జోసెఫ్ బాబు, సెక్రటరీ, ట్రెజరర్ స్టీఫెన్ ప్రభుదాసు ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రైట్ రెవరెండ్ ప్రసన్న కుమార్ గురువులు, కెన్ని మనోజ్ హాజరై ప్రసంగిస్తారన్నారు. నంద్యాల జిల్లాలోని యువతీ యువకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సెమీనార్ 23, 24 తేదీల్లో రెండు రోజుల పాటు ఉంటుందన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయం



పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం


నంద్యాల(సిటీ): పట్టణంలో మున్సిపాలిటీ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమని ఆర్యవైశ్య సేవాసమితి అధ్యక్షుడు బింగుమళ్ల శ్యామ్, 12వ వార్డు కౌన్సిలర్ శ్యాంసుందర్ లాల్ అన్నారు. దసరా పండగను పురస్కరించుకుని శానిటేషన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రజలు ప్రశాంతంగా, ఆరోగ్యకరంగా నివాసం ఉండేందుకు నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమోఘమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కోశాధికారి చంద్రమౌళి, ఉపాధ్యక్షులు కృష్ణ, కార్యదర్శులు గోపాల్, నాగరాజు, గౌరవసలహాదారు ఆనంద్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో జేసీ



జేసీ రాహుల్‌కుమార్ రెడ్డికి లడ్డూప్రసాదాలను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను ఆదివారం నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయమర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేద పండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రాదాలు, జ్ఞాపికను అందజేశారు.



పసురపాడు గ్రామంలో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



ఉయ్యాలవాడలో దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



దొర్నిపాడులో దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరి



రుద్రవరంలో మహిషాసురమర్దిని అలంకారంలో..



ముత్యాలపాడులో మహిశాసురమర్దినిదేవి



శ్రీమహిషాసురమర్దిని అలంకారంలో శ్రీకాళికాంబదేవి



బాలాజీ కల్యాణ మండపంలో దుర్గాదేవి

జయ జయహే మహిషాసురమర్దిని


- వైభవంగా దుర్గాష్టమి వేడుకలు
- అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు







సంజీవనగర్ రామాలయంలో దుర్గాదేవిగా, బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయంలో మహిషాసురమర్దినిగా, దుర్గాదేవిగా,మద్దిలేటిస్వామి ఆలయంలో శ్రీకాళరాత్రిగా







రమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో మహిషాసురమర్దినిగా, షిర్డీసాయి ఆలయంలో దుర్గాదేవిగా, ఆళ్లగడ్డలో మహిషాసురమర్దిని అలంకరణ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని 8వ రోజైన ఆదివారం పలు దేవాలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక మండపాల్లో మహిషాసురమర్దిని, దుర్గాదేవిగా అలంకరించారు.

- పట్టణంలోని శ్రీకాళికాంబదేవస్థానంలో శ్రీకాళికాంబదేవికి ఉదయమే పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని స్వర్ణాభరణ అలంకారంలో అలంకరించారు. సాయంత్రం ప్రత్యేక మండపాల్లో అమ్మవారిని మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.
- స్థానిక మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి మూలవిరాట్‌కు ఉదయమే పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని వివేషాలంకరణలో నిర్వహించారు. మూలవిరాట్ వాసవీ మాతకు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరించి, మహిళలచే సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక మండపాలలో మహిషాసురమర్దినిగా అలంకరించారు.
- స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లోని శ్రీకొట్టి సుబ్బమ్మ కల్యాణ మండపంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.
- స్థానిక సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేక అలంకరణలో అలంకరించారు. అదే విధంగా శివాలయంలోని కాశీవిశ్వనాథునికి, కాశీవిశాలాక్షికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహాచండీ యాగం చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.
- బ్రహ్మనందీశ్వరస్వామికి ఉదయన్నే మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పార్వతీదేవికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. శ్రీమహానందీశ్వర కామేశ్వరి సహిత ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ గావించారు. సాయంత్రం అమ్మవార్లను మహిషాసురమర్దిని, దుర్గాదేవిలుగా అలంకరించారు. అనంతరం శ్రీకామేశ్వరదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు గ్రామోత్సవం నిర్వహించారు.
- స్థానిక తెలుగుపేటలోని శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రతిష్టించిన దుర్గాదేవి విగ్రహాన్ని శ్రీకాలరాత్రిదేవిగా అలంకరించారు.
- స్థానిక జగజ్జననీ నగర్‌లోని శ్రీజగజ్జననీ దేవాలయంలో అమ్మవారి మాలాధారణ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక రాహుకాల పూజలు నిర్వహించారు.
- స్థానిక కల్పనా సెంటర్‌లోని కాశిరెడ్డినాయన ఆశ్రమంలో అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో అలంకరించారు. అనంతరం యథావిధిగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
- పట్టణంలోని బాల్కొండ హాల్ వీధిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా బొమ్మలసత్రం షిర్డీసాయి దేవాలయంలో అమ్మవారి విగ్రహానికి దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రెవెన్యూ క్వార్టర్స్ మహిషాసురమర్దినిగా అలంకారంలో అలంకరించారు.

గోస్పాడు: మండలంలోని పసురపాడు గ్రామంలో శ్రీ నీలకంఠేశ్వరస్వామి, శ్రీలింగమయ్యస్వామి ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవం, శరన్నవరాత్రుల వార్షికోత్సవంలో భాగంగా లలితాదేవి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారికి శ్రీదుర్గా దేవి అలంకారంలో అలంకరించారు. అర్చకులు సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా దుర్గాష్టమి

ఆళ్లగడ్డ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో బాగంగా దుర్గాష్టమిని పురస్కరించుకుని ఆదివారం అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు. స్థానిక అమ్మవారి శాలలో ఉదయం ఆర్యవైశ్య మహిళలు సాముహిక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం వాసవిమాతను మహిషాసురమర్దిని గా అలంకరించి భక్తుల దర్శనార్థం కొలువుంచారు. రాత్రి దుర్గాదేవి అలంకరణలో పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు గ్రామంలో చౌడేశ్వరి దేవి దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్‌లో దుర్గాష్టమి పురస్కరించుకుని ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయుధపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామక్రిష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దొర్నిపాడు: దసరా నవరాత్రుల్లో భాగంగా ఆదివారం కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రామసుబ్బయ్య తెలిపారు.

రుద్రవరం: స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించారు.

చాగలమర్రి: ముత్యాలపాడు గ్రామంలో అమ్మవారు శ్రీ మహిశాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు బనగానపల్లె రవికుమార్ వేద మంత్రోచ్చారణతో ఉదయం అమ్మవారుకు ఆదిత్యాది నవగ్రహజపములు, మహానైవేద్యం, మహామంగళ హారతి తదితర పూజలు జరిపించారు.



దుర్గాదేవిగా శ్రీవాసవీ మాత



కోదండరామాలయంలో దుర్గాదేవిగా అమ్మవారు



రెవెన్యూ క్వార్టర్స్‌లో మహిషాసురమర్దినిగా..

పోలీస్ స్టేషన్లలో ఆయుధపూజ



ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయుధపూజ నిర్వహిస్తున్న సీఐ రమేష్‌బాబు



దొర్నిపాడులో పూజల్లో పాల్గొన్న ఎస్‌ఐ, సిబ్బంది

ఆళ్లగడ్డ : శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా దుర్గాష్టమిని పురస్కరిచుకుని ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయుధపూజ నిర్వహించారు. సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో అన్ని రకాల ఆయుధాలను శుభ్రపరిచి, కుంకుమ, పసుపు పట్టించి పూలు, పత్రాలతో అలంకరించి అమ్మవారి ఎదురుగా ఉంచి అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ వెంకట్రరెడ్డి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గోస్పాడు: మండల కేంద్రమైన గోస్పాడులోని పోలీస్ స్టేషన్లో ఆదివారం ఆయుధ పూజ నిర్వహించారు. దసరా పండుగను పురస్కరించుకొని ప్రతి ఏడాది ఆయుధపూజ ఆనవాయితీగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా దుర్గామాత పూలమాలలు వేసి నైవేద్యాన్ని సమర్పించారు. ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయుధ పూజ చేశారు. పూజాలో ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దొర్నిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం దుర్గాష్టమిని పురస్కరించుకోని ఎస్ఐ తిరుపాల్ ఆయుధపూజ చేశారు. పోలీసుల ఆయుధాలను శుభ్రం చేసి సిబ్బందితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఏఎస్ఐ రంగయ్య పూజల్లో పాల్గొన్నారు.

ఎన్‌జీఓ కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- రూ.73.30లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం
- ప్రారంభించిన ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల(సిటీ): పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక 18వ వార్డు ఎన్‌జీఓ కాలనీలో రూ.73.30 లక్షలతో నూతనంగా నిర్మించిన 3 సీసీ రోడ్లను వార్డు కౌన్సిలర్ దేశం సులోచన, వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దేశం సుధాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి రోజూ పట్టణంలో ఏదో ఒక ప్రాంతంలో అభివృద్ధిని చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తున్నామన్నారు. ఎన్‌జీఓ కాలనీలోని పార్కును కూడా అభివృద్ధి చేసి ప్రజలకు అందించామని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మంచి చేస్తామన్నారు. నంద్యాల పట్టణాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారని, మరిన్ని నిధులతో పట్టణాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇదివరకే అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించామని గుర్తుచేశారు.

ఐఎంఏ నంద్యాల అధ్యక్షురాలిగా వసుధారాణి



వసుధారాణి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ఐఎంఏ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డాక్టర్ విజయభాస్కర రెడ్డి ఆదివారం ప్రకటించారు. 2023–24 సంవత్సరానికి డాక్టర్ వసుధారాణి అధ్యక్షురాలిగా, 2024–25 సంవత్సరానికి అధ్యక్షులుగా డాక్టర్ చిత్తలూరు మధుసూదనరావు ఎంపికైనట్లు తెలిపారు. రెండు సంవత్సరాల పాటు ఈ కార్యవర్గం ఉంటుందన్నారు. కార్యదర్శిగా డాక్టర్ ఫణిల్‌కుమార్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ బార్గవవర్ధన్‌రెడ్డి, డాక్టర్ జి.చంద్రశేఖర్, డాక్టర్ మాధవి, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ రాధికా, జ్యోతి, డాక్టర్ ఎస్.సునిత, డాక్టర్ నీలాప్రసాద్, కోశాధికారిగా డాక్టర్ సురేంద్రనాథరెడ్డి, జాయింట్ కోశాధికారిగా డాక్టర్ మురళీ, కౌన్సిల్ సభ్యుడిగా డాక్టర్ సహదేవుడు ఎన్నికయ్యారని చెప్పారు. ప్రతినిధులుగా డాక్టర్ లక్ష్మయ్య, సునిల్‌కుమార్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా దీపక్ కుమార్, నెట్ల శిల్పా, డాక్టర్ జనార్దన్‌రెడ్డి, భారవవర్ధన్‌రెడ్డి, విజయ్‌బాబు, జహింగీర్ బాషా, సిద్ధార్థ, భరత్‌కుమార్‌రెడ్డి, మణిదీప్, లలితకుమారిలతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యులుగా నంద్యాల అధ్యక్షులు డాక్టర్ జఫరుల్లా, రాష్ట్ర శాఖలో ఉన్న అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయభాస్కరరెడ్డి, అనిల్‌కుమార్, మధుసూదనరెడ్డి, వినోద్, లక్ష్మిసౌజన్య ఎంపికయ్యారన్నారు.

నూర్‌బాషా దూదేకుల సంఘం ఆత్మీయ సమావేశం



సంఘీభావం తెలుపుతున్న నూర్‌బాషా సంఘం నాయకులు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలోని సచివాలయ ఆవరణలో ఆదివారం చాగలమర్రి మండల నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి కదిరి దస్తగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ గారి ఆదేశాల మేరకు నూతనంగా ఏర్పాటైన జిల్లా, మండల కార్యవర్గం సభ్యుల ఆత్మీయ సమావేశాన్ని ముత్యాలపాడులో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో దూదేకుల సామాజికవర్గానికి సంబంధించిన సమస్యలపై దృష్టి సారించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా అన్నీ మండలాల నుంచి నూతనంగా ఎన్నికై న అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.సిద్దయ్య, మీడియా స్టేట్ ఇన్‌చార్జ్ హుసేన్, ప్రకాశం జిల్లా మహిళా అధ్యక్షురాలు జరీనా, నియోజకవర్గ అధ్యక్షులు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

మహిళకు అరుదైన శస్త్రచికిత్స

- అండాశయంలో 6.5 కిలోల కణితి తొలగింపు



మహిళ కడుపులోనుంచి తొలగించిన కణితి

ఆళ్లగడ్డ : కడుపు నొప్పితో బాధపడుతున్న ఓ మహిళకు ఆళ్లగడ్డ వైద్యులు ఆదివారం అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన జహీరాబీ అనే మహిళ కొంత కాలంగా కడుపులో నొప్పిగా ఉందని చాలా ఆసుపత్రుల్లో చూపించుకుంది. అయితే కడుపులో అండాశయానికి కణితి ఉందని, తొలగించడం కష్టమని చెప్పడంతో ఆళ్లగడ్డ గౌతమి ఆసుపత్రికి వచ్చింది. డాక్టర్లు నాగేశ్వర్‌రాజు, రాజేశ్వరీ హైరిస్క్ అయినప్పటికీ మహిళకు శస్త్రచికిత్స చేసి కడుపులో ఉన్న సుమారు 6.5 కిలోల కణితిని తొలగించారు. ఇంతవరకు జిల్లా కేంద్రాలు, నగరాల్లో చేసే శస్త్రచికిత్స ఆళ్లగడ్డలో తొలిసారిగా చేయడం విశేషం.

పంటలు కళకళ



మినుము పంట

శిరివెళ్ల: మండలంలో ఖరీఫ్ రబీ పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఈ ఏడాడి వర్షాభావ పరిస్థితులు నెల కొనప్పటికీ అడపాదడపా కురిసిన వర్షాలు, బోర్లు, చెరువులు, బావుల నీటితో పంటలు సాగు చేశారు. ఎక్కువగా జొన్న, మొక్క జొన్న, మిరప, వరి పంటలు సాగయ్యాయి. మండలంలో ఈ ఏడాడి ఆరుతడి, మెట్ట పంటల సాగు సాధారణ విస్తీర్ణం కంటే పెరిగాయి. మిరప పంట సాధారణ సాగు 469 ఎకరాలు కాగా 830 ఎకరాలు, మొక్క జొన్న సాధారణం 797 కాగా 1250 ఎకరాలు, మినుము సాధారణ విస్తీర్ణం 2,792 ఎకరాలు కాగా 2,800 ఎకరాల్లో పంట వేశారు. కాగా మండలంలో ఈ ఏడాడి వరి పంట విస్తీర్ణం సగానికి సగం తగ్గిపోయింది. వరి సాధారణ సాగు 15,840 ఎకరాలు కాగా ప్రస్తుతం సాగయ్యింది కేవలం 8,418 ఎకరాలు మాత్రమే. కేసీ కెనాల్, తెలుగు గంగ కాల్వల కింద సాగు నీటిపై అధికారిక ప్రకటన రాక పోవడంతో ఆరుతడి పంటలు సాగు చేయాలని అధికారులు చెప్పడంతో వరి సాగు తగ్గిపోయింది. కోటపాడు, వీరారెడ్డిపల్లె, కామినేనిపల్లె, వెంకటాపురంలలో వంద శాతం వరి సాగయింది.



వరి పంట